# మార్పు తెచ్చిన మాలతి

శ్రీమతి ఎస్. రాజేశ్వరీరాణి

బండిదిగి లోనికొచ్చిననాడే ఆ ఇల్లు తమాషాగా, అర్థంకాని సమస్యగా మాలతి హృదయంలో నాటుకొనిపోయింది. అత్తగారికి, తోటికోడలికి మాటలు లేవని మూడు రోజులకుగాని తెలిసింది కాదు మాలతికి. అత్తగారు నోరుగలావిడ. తోటికోడలు సుగుణా అత్తగారికేం తీసిపోదు. ఆమెకు ఆమె పేరుకు ఒక్క ఆవగింజంతయినా సంబంధంలేదు. తెల్లవారే అత్తగారు వెయ్యి సబగుళ్లు సబగుతూ పనిఅంతాచేసి ఆవిడే మడికట్టుకొని రెండింటికి ఇంతవుడకేస్తుంది. పదికి ఫలహారాలు ముగించి అటు బావగారు, ఇటు భర్తా ఆఫీసులకి బయలుదేరుతారు. బావగారెప్పుడూ నాలుగు పదార్థాలు లేవని అరుస్తాడు. ఒక్క సాధకంతో తినలేడు. సుగుణ వంటగదికేసి చూడదు. ఫలహారాలు ముగిసిన తర్వాత తన నాలుగేళ్ల కూతురికి జడవేసి తానూ దువ్వి ముడేసుకొని ఆ చేతులతో ముఖం, చేతులు అంతా రుద్దుకొని ఇన్ని నీళ్లు చేది దబదబా పోసుకొని ముఖం మాత్రం సబ్బుతో కడుక్కొని వస్తుంది తర్వాత కళగా అంత బొట్టెట్టుకొని గదిలోకి దారి తీస్తుంది. సరిగ్గా భర్తవచ్చి వెళ్లిన తర్వాత భోజనానికి లేస్తుంది. మాలతి కావిడ తరహా ఆశ్చర్యాన్ని కలిగించింది. గదిఅన్నా వూడవదు. ఆ మురికి కూపంలో పడి నిద్రపోతుంది. మాలతి రెండు రోజులు అన్నీ గమనించింది. రాత్రి వంట సుగుణది వృశికీ వృడ కని మెతుకు లోకనాడు గంజితో కూడిన ముద్ద ఒకనాడు.

మొదట రోజు మాత్రం "భోజనానికి రా" అంది సుగుణ మాలతిని. రెండో రోజూ పిలిచింది. మూడో రోజు మాలతి వడ్డనకుపోయింది. అత్తగారు తనతో కూడా ముభావంగా వుండిపోవడం మాలతికి కష్టమేసింది. నాలుగోనాడు అత్తగారి కన్నా ముందులేచి కాఫీపొయ్యి రాజేసింది. అత్తగారొచ్చిచూసి వెళ్ళిపోయింది. కాఫీ గ్లాసుల్లో పోసిపెట్టింది. అందరూ కాఫీ త్రాగిం తర్వాత గ్లాసులన్నీ కడిగి షెల్ఫులో పెట్టింది. తలదువ్వుకొని స్నానంచేసింది. ఆ రోజుకి కూరలు ముందటి రోజు సాయంత్రమే బావగారు తెస్తారు. అత్తగారు మాలతి స్నానం చేస్తుండగా వచ్చింది. మాటాడకుండా వెళ్లిపోయింది.

భోజనాల సమయంలో బావగారు అన్నారు "అమ్మా! పులుసు చాలా

బాగుంది.'' మాలతికి సిగ్గేసింది. సుగుణని భోజనానికి రమ్మంది.

నాలుగు రోజులు ఇట్టే తిరిగిపోయినవి. ఇల్లంతా పరిశుభ్రంగా వుండడం గమనించిన కృష్ణమూర్తి ఆ రాత్రి భార్యని అడిగాడు. ''ఎన్నాళ్లు నువ్వు దిద్దుతావు?''

మాలతికి మొదట కష్టంవేసినా ''అలా అంటారేమండి? ఇల్లు పరిశుభ్రంగా వుండడంతప్పా? తప్పయితే చెప్పండి. నేనూ గదిలో కూర్చుంటాను'' అన్నది.

మూర్తి నవ్వాడు ''నీకు కోపంవచ్చినా అందంగానేవుంది మాలతీ! సంసారాన్ని దిద్దగలవు. కానీ జీవితాలని దిద్దగలవా? నువ్వు నీ సుఖాన్ని పాడుచేసుకొని వీళ్లకు సేవచేస్తూ వుండాలిసిందే. మా వదిన తరహా గమనించావా?''

మాలతి ఆలోచనలోపడ్డది. భర్త అన్నట్లు జీవితాన్ని సరిదిద్దాలి! సంసారాన్ని సరిదిద్దాలావద్దా?

''నువ్వు చేస్తున్నపని తప్పని చెప్పడం లేదు మాలతీ! మా వదిన అణగి మణిగి యుంటుందని అమ్మ ఆశపడ్డది. బస్తీ పిల్లవని నిన్ను పెళ్ళాడుతానంటే మా అమ్మ మొదట వద్దన్నది. కానీ వదిన గుణాలు క్రమేణా ఆ విడకి వంటపట్టం—తర్వాత ఆ విడ మారిపోయింది. మా అమ్మకి శాంతి చేకూర్చాలని నేను కలగనేవాణ్ణి. ఆ కల నిజమైతే నేను తప్పక ధన్యుణ్ణే! నీతో మాట్లాడుతుందా లేదా మా అమ్మ?''

భర్త మాటలు మాలతి చెవిలో పడినవి. కానీ ఆ విడ మారాడలేదు. బావగారెప్పుడూ చిరచిర లాడుతూనే వుంటారు. భార్యని అరుస్తూ వుంటారు. వారి తప్పేమిలేదు. అంతా ఆ విడతప్పే. ప్రతి చిన్నపనికి ఆక్షేపణ, నిర్లక్ష్యం. గట్టిగా అరిచి మాట్లాడటం ఆ విడ గుణాలు!

మాలతి సాయంత్రమంతా ముఖం నల్లగపెట్టుకొని పనంతా చేసింది. మరో వారంరోజులు జరిగిపోయినవి. మాలతికి చికాకు వేసింది. తెల్లవారి లేచింది మొదలు పడుకొనేదాకా పని; అత్తగారు అడ్డంవస్తుంది కాని మాలతి ''నేచేస్తాలెండి'' అంటుంది. కానీ హఠాత్తుగా ఆ సాయంత్రం తోటికోడలు పిలిచింది పేరుపెట్టి.

''నావల్లు హూనమయిపోతోంది, నేను చచ్చినా మెరుగు; నాకాచావురానంటోంది-నీతో పోటీగ పనికి రాలే నమ్మా; అన్నీ ఎగిరెగిరి చేస్తావు. ఏదో రెండు రోజులు మూడురోజులా ఎగిరి పడటానికి! కలంత కాలం కాపురం చెయ్యవలసిన వాళ్లం''

సుగుణ మాటలు నిజానికి మాలతికి ఏమీ అర్థంకాలేదు; ఆశ్చర్యంగావిన్నది. తర్వాత

“అత్తగారు పెద్దవారండి. అంతా వారే విసుగ్గా చేయడం బాగుంటుందా; ఏదోనాకు తోచిన పని నేను చేస్తున్నాను-అంతే.” అన్నది మెల్లగ నిలిపినిలిపి.

సుగుణ ముఖం చిట్లించింది“ తెల్లవారి వంట ఆవిడచేస్తుంది. నీకేం నేనేమీ పోటీగా చెయ్యలేను. నువ్వు ఎగిరెగిరి ఎంతకాలం చేస్తావో చూస్తాను. ఈ మాట తీసికెళ్లి అత్తగారికి చెప్పి అల్లరి పెట్టు-అందుకేకదా నువ్వు ఎగిరెగిరి చేయడం అంతా!”

మాలతికి కోపం, అసహ్యం వేసింది. ఈమె నిల్చుకోకుండా వంటగది కొచ్చింది. బావగారు ‘వడ్డించనన్నారారాదా’ అన్నారేమో! అవును - వారికి మాత్రం ‘తల్లి’ అని లేదా ఏమిటి?

ఈలోగా అత్తగారు గరిట పుచ్చుకొని వంటగదిలోకి పోవడం చూసింది. అన్నం సంగతే మర్చామన్నమాట జ్ఞప్తికొచ్చి గబగబగదిలోకి వచ్చింది. అప్పటికే అన్నం వారుస్తూంది అత్తగారు. మాలతి రెండు నిముషాలు నిలబడ్డది. ఆమె మనసంతా చెదిరిపోయింది. రాత్రిభోజనంకూడా అత్తగారే వడ్డించింది. మాలతికి తీవ్రమైన తలనొప్పి ప్రారంభమయింది. కృష్ణమూర్తి గదిలోకి వచ్చాడు. మాలతిని చూచాడు. మాలతి మాట్లాడకుండా వంటగది కొచ్చింది. అత్తగారు కంచాలు తీస్తూంది. సుద్దిపెట్టి సుగుణను లేపింది. సుగుణ బద్ధకంగా వళ్లువిరుచుకొని లేచివచ్చింది. ఒకవిస్తరే వేయడంవల్ల సుగుణ మాలతి వేపు చూసింది. “తలభారంగావుందండి” అన్నది మాలతి.

సుగుణ భోంచేసి వెళ్లిపోయింది. వంటగది సర్ది మాలతి గదికొచ్చింది. దుఃఖం వుబుకుతున్నా మ్రింగుకొని మంచంపై పడుకొంది. భర్తలేడు. సాయంత్రమే అన్నాడు ‘స్నేహితునితో సినిమాకు వెళ్లుతున్నా’నని. మాలతి మ్రింగుకున్నా దుఃఖంపొంగింది. చాలా సేపువడ్చింది. తాను అన్నంతిన్నదనే అనుకొంటారు అత్తగారు భర్తాను. ‘ఏంకాపురం ఇది’ తెల్లవారిలేస్తే మాలతికి ప్రపంచం గిర్రున తిరిగినట్లయింది. భర్తన్నట్లు సంసారాన్ని సరిదిద్దగలిగింది తాను; జీవితాలని సరిదిద్దడమంటే మాటలా? ఆఖర్న తాను సుగుణ లాగయిపోతుందా? మాలతి గబుక్కున లేచింది. పక్కన భర్తలేడు. వంటగదికొస్తే అత్తగారు గ్లాసుల్లో పోస్తూంది కాఫీ. మాలతి ఒక్కసారి సిగ్గుతో కృంగిపోయింది. సుగుణకూడా వచ్చిన కొత్తలో తనలాగే ప్రవర్తించి వుండవచ్చు.

కాఫీ త్రాగనుంటే చచ్చినంత సిగ్గేసింది. కాఫీ ఎలాగో త్రాగి వంటకు స్నానం చేసింది. మామూలుగా అత్తగారూ స్నానంచేసి వచ్చింది. మాలతి కొద్దిగా భయపడ్డది.

"నే చేస్తానులేవంట" కరుగ్గా అంది అత్తగారు. ఆ నాడే మాలతితో మాట్లాడం.

మాలతి కంట నీరు తిరిగింది. "నేనే చేస్తానండి. రాతి తల నొప్పిగావుండింది" అన్నది మెల్లగ.

అత్తగారు ఈనాడు మాలతిని కళ్ళారా చూసింది. ఒక్క రాత్రికి మాలతి కళ్లు లోనికెళ్ళినవి. 'భోంచేసావా లేదా రాత్రి?' ఈ సారి అత్తగారి గొంతు కరుగ్గా లేదు.

మాలతి కంటనీరు గిఱ్ఱున తిరిగింది, "అవి అత్తగారెక్కడ చూస్తుందో అని తలవంచింది." అత్తగారు దగ్గిరకొచ్చి "ఏడవడం దేనికమ్మా? నీవు సుగుణలాగా వుంటావని నేను అనుకోలేదు. దాని మాటలకు నీ సమాధానం విన్నాను. నువ్వు నాకు సరోజ ఎలాంటిదో అలాంటిదానివి. ఈ పూటకు నేచేస్తాలే" అన్నది మాలతి ముఖం వికసించింది. అత్తగారు తనతో అలా మాట్లాడినందుకు. మరునాడు సుగుణ వంటకు స్నానం చేసింది మాలతి వచ్చేసరికి. ఆ రాత్రి మూర్తి మాలతితో అన్నాడు "చాల గట్టిదానివే-ఏదో అనుకొన్నాను. జీవితాలనికూడ సరిదిద్ద గలిగావు." మాలతి సిగ్గుపడ్డది; మార్పు ఎలా వచ్చిందో ఆమెకు సమస్యే అయింది.

సంపాదకీయములు 279 పేజి నుండి

ప్రతివ్యక్తి బాధ్యతను గుర్తించి శక్తివంచన లేకుండా కృషి చేయడం తన శ్రేయస్సును, దేశ శ్రేయస్సును ప్రపంచకళ్యాణాన్ని ఉద్దేశించి జరుగవలసినది. అలా తయారు చేయడానికనువైన విధానం ఆకర్షనీయంగా ఎప్పుడు రూపొంది అమలు జరగనున్నదాయని అభ్యుదయ కాముకులు ఎదురుచూస్తున్నారు.

ఈనాటి మన జీవిత వ్యయ ప్రమాణము చాల తక్కువేయయినా పెరుగడానికి దేశపు విస్తీర్ణమున్నది, సహజ సంపదలున్నవి; ప్రజాశక్తిసామర్థ్యాలున్నవి; ఉన్న వసతులను వినియోగించుకోగలిగిననాడు నిరుద్యోగుల సంఖ్య అత్యంత పరిమితం కాగలదు.

జనాభా పెరుగుదలమాత్రం నిరుద్యోగ వ్యాపికి కారణం కాదేమో. శక్తిసామర్థ్యాలుండి యోగ్యతల ననుసరించి ఏదో ఒక వృత్తిని ప్రతియొక్కడు అవలంభించి జీవనోపాధిని కల్పించుకోడానికి అవకాశమున్నప్పుడు జనాభా పెరుగుదల వలన నష్టం రాదు.

సోమరితనాన్ని ప్రభుత్వము సహించకుండా దేశంలో సాగుకనువైన భూమిని ప్రతి అంగుళం జాతీయ శ్రేయస్సుకు వినియోగపడేలాగునను, సహజ సంపదలను పూర్తిగా వినియోగించుకోనేలాగునను పూనుకొనినప్పుడు జనాభా పెరుగుదల, నిరుద్యోగ విస్తరణ పరిమితం కాగలవు.

విద్యార్థులు సయితం తమ విద్యా విజ్ఞానములను ఏ గుమాస్తాగిరికనియో ఉద్దేశించకుండా జాతీయ శ్రేయస్సుకు రూపొందించడంలో ఏ వృత్తియైనా గౌరవప్రదమైనదే అనియు, ఇందులో ఉత్తమ, అధమ, తరతమ స్థాయిలు ఏమి లేవని గుర్తించి పరస్పరము అభిమానించుకొని, సానుభూతితో వ్యవహరించి తమ భవిష్యత్తు జీవితాలను రూపొందించుకొనినచో జాతీయ ఆర్థిక వ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పు రాగలదు, అట్టి దానిని ప్రోత్సహించనున్న విద్యా విధానము రూపొందవలసియున్నది.